క్లుప్తంగా

పంటల పరిశీలన



నిజాంపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ వసంత సుగుణ

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నంది గామ, నిజాంపేట గ్రామాలలోబుధవారం వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) వసంత సుగుణ పలు రైతుల మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించారు. ఏఈఓ శ్రీలత, కావేరి, రైతులు వెంకట్‌రాంలు, నారాగౌడ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రేగోడ్ మండల్ లయన్స్ క్లబ్ చైర్మన్‌గా సంగమేశ్వర్



ప్రమాణ స్వీకారంలో సంగమేశ్వర్

రేగోడ్(మెదక్): ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ రేగోడ్ మండల్ చైర్మన్‌గా గంజి సంగమేశ్వర్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. పిట్లంలో జరిగిన ప్రమాణ స్వీకారనికి హాజరైన లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ జనార్దన్‌రెడ్డి, పీ బసవేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కార్యదర్శి చోటుమియా, ట్రెసర్ జయారాజ్, నూతనంగా ఎన్నుకోబడిన లయన్స్ క్లబ్ కుటుంబ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పీర్యానాయక్, గాండ్ల నర్సింలు, నాగిరెడ్డి, వెంకట్ రెడ్డి, సంగ్యా నాయక్, లక్ష్మణ్ నాయక్,రచప్పా, శ్రీనివాస్ గాంధీ, నర్సింహారెడ్డి, లక్ష్మణ్ రావు, భాను ప్రకాష్, ఉప్పరి రాజు పాల్గొన్నారు.

చలో కోరుట్లను విజయవంతం చేయాలి

నర్సాపూర్: రాజ్యాధికార సాధన కోసం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13న చేపట్టే చలో కోర్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన స్థానిక సంఘం నాయకులతో కలిసి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కోరుట్లలో పద్మశాలి యుద్ధ భేరి ఆత్మగౌరవ సభకు సంఘం సభ్యులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

పాఠశాల ఆవరణలో వర్షం నీరు తొలగించండి

సాక్షి ఎఫెక్ట్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి హరిచంద్‌తండా పంచాయతీ దేవులతండా ప్రాథమిక పాఠశాల వద్ద వర్షంతోనీరు నిల్వడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సాక్షి దినపత్రికలో బుధవారం పాఠశాల ఆవరణలో వర్షపునీరు అనే వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన డీఈఓ రాధాకిషన్ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని ఆదేశించారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉన్నట్లయితే విద్యార్థులను మరో చోట కూర్చోబెట్టాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతారాయం

మెదక్: జిల్లా కేంద్రంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేయనున్న నేపథ్యంలో మెదక్‌తో పాటు మెదక్ మండలం, హవేళీ ఘనపూర్, చిన్నశంకరంపేట మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు కరెంట్ ఉండదన్నారు.

శేరీల గ్రామాన్ని విడదీయొద్దు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ పరిధిలో అనుబంధ గ్రామంగా ఉన్న శేరీల గ్రామాన్ని కొందరు తమ స్వార్థం కోసం విడదీయడానికి ప్రయత్నాలు చేస్తున్నారంటూ గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. తమ గ్రామాన్ని వెల్దుర్తి మేజర్ పంచాయతీలోనే ఉంచాలని వారు కలెక్టర్, ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి వినతిపత్రం అందించనున్నట్లు లింగం, సత్యనారాయణ, ధాకులు, మల్లేశం తెలిపారు.

పీహెచ్‌సీకి 102 వాహనం

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి పీహెచ్‌సీకు 102 కొత్త వాహనం రావడంతో బుధవారం మండల వద్యాధికారి శ్రీకాంత్ ప్రారంభించారు. ఎంపీహెచ్ఓ రమేష్, పైలెట్ అంజాగౌడ్, సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దున్నపోతుకు వినతిపత్రం

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు.

అధ్వానంగా పాలిటెక్నిక్ హాస్టల్

- చుట్టూ పిచ్చిమొక్కలు... మురుగునీరు
- వసతి గృహంలో వణికిస్తున్న పాములు, తేళ్లు
- భయందోళనలో విద్యార్థినులు



వసతి గృహంలోకి వెళ్లే దారి దుస్థితి

మెదక్ మున్సిపాలిటీ: చుట్టూ పిచ్చిమొక్కలు... మురుగునీరు అడుగు తీసి అడుగు వేయాలంటే ఎక్కడ ఏ పాము, తేళ్లు ఉన్నాయో తెలియని భయాందోళనతో వణికిపోతున్నారు ఇదీ మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ వసతి గృహం విద్యార్థినీల పరిస్థితి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వసతి గృహ పరిసరాల్లో పూర్తిగా చుట్టు ఉన్న చెరువులోంచి వరదనీరు భారీగా వచ్చి చేరింది. మరోవైపు పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో వసతి గృహంలోకి పాములు, తేళ్లు వస్తున్నాయని, దీంతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

మెదక్ పట్టణంలోని నర్సఖేడ్‌లో ప్రభుత్వ మహిళా కళాశాలతో పాటు వెనకనే వసతి గృహం ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన విద్యార్థినీలు వసతి గృహంలో ఉంటూ పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తున్నారు. కాగా వసతి గృహంలో మాత్రం 200 మంది ఉంటున్నారు. పాత వసతి గృహం శిథిలం కావడంతో మరో వసతి గృహంలోకి విద్యార్థులను తరలించారు. కేవలం 16 గదుల్లో 200 మంది విద్యార్థినీలు ఉంటున్నామని విద్యార్థులు వాపోయారు. బట్టలు ఉతుక్కోవడానికి వెళ్లే దారిలో వరదనీరుతో పాటు పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వసతి గృహ పరిసరాల్లో పూర్తిగా చుట్టు ఉన్న చెరువులోంచి వరదనీరు భారీగా వచ్చి చేరింది. పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో వసతి గృహంలోకి పాములు, తేళ్లు వస్తున్నాయని తెలిపారు. రాత్రి వేళలో వసతి గృహం నుంచి ప్రాంగణంలోకి రావాలంటే ఎక్కడా పాములు, తేళ్లు ఉంటాయోనని భయంగా ఉందన్నారు.

ఈ విషయంపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు కళాశాల సూపరింటెండెంట్ మాలతి తెలిపారు. విద్యార్థినిల పరిస్థితి చూస్తుంటే



ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు

మాకే జాలీ వేస్తుందన్నారు. ఉన్నతాధికారులు చొరవచూపి వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మాకే భయంగా ఉంది



వసతి గృహ పరిస్థితి చూస్తుంటే మాకే భయంగా ఉంది. మా అమ్మాయికి పాలిటెక్నిక్ కళాశాలలో సీటు వచ్చింది. దూర ప్రాంతం కావడంతో ఇక్కడే వసతి గృహంలో చేర్పించాం. కానీ ఇక్కడ పరిస్థితి చూస్తే చాలా ఆందోళనకరంగా ఉంది. శిథిలావస్థలో ఉన్న పాత భవనం ఎప్పుడు కూలుతుందో తెలియదు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలి.

–యాదయ్య, టేక్మాల్, విద్యార్థిని తండ్రి

ఎటు చూసినా వరదనీరు.. పిచ్చి మొక్కలే..



వసతి గృహం చుట్టూ పిచ్చి మొక్కలు వరదనీటితో నిండిపోయింది. ఇంతటి భయానక పరిస్థితుల్లో పిల్లలను వదిలేయడం దారుణం. విద్యార్థినిలను ఎవరు పట్టించుకోక పోవడం అన్యాయం. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించి, వరదనీరు రాకుండా చర్యలు చేపట్టాలి.

– లక్ష్మణ్, కల్హేర్, విద్యార్థిని తండ్రి

పెచ్చులూడిన పాఠశాలపై కప్పు



పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

శివ్వంపేట(నర్సాపూర్): శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం వల్ల విద్యార్థులకు హాని ఉందని నిరసిస్తూ తల్లిదండ్రులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని లింగోజిగూడలోని ప్రాథమిక పాఠశాల భవనం పై పెచ్చులూడి కింద పడ్డాయి. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాల వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. గ్రామ శివారులో నూతనంగా పాఠశాల భవనం నిర్మించినప్పటికీ అందులో పూర్తి వసతులు కల్పించికపోవడంతో ప్రారంభించలేదని వారు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థ పాఠశాల భవనంలో విద్య బోధన జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ రాయరావు చెరువుకట్టపైకి వెళ్లేందుకు నర్సాపూర్ – కాగజ్ మద్దూర్‌కు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు నుంచి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చెరువు కట్ట వరకు పార్మేషన్ రోడ్డు వేసి పక్కన స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లను అమర్చారు. ప్రస్తుతం చెరువు నిండి అలుగు పారుతోంది. అక్రమంగా మట్టి తరలించే వ్యాపారులు ఇష్టానుసారంగా స్తంభాల చుట్టూ తవ్వకాలు చేశారు. దీంతో స్తంభాలు ఎప్పుడు కూలి కిందపడతాయొనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అక్రమ ఇసుక ఫిల్టర్ కూల్చివేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అంతారం గ్రామ పరిధిలోని జైరాం తండాలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుకఫిల్టర్‌ను రెవెన్యూ, పోలీస్‌శాఖ సిబ్బంది కూల్చివేయించారు. బుధవారం ఆర్ఐ నాగరాజు మాట్లాడుతూ.. జైరాం తండాకు చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఇసుక ఫిల్టర్ నిర్వహిస్తూ, ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక డంపింగ్ చేసుకొని వ్యాపారం చేస్తున్నాడని విశ్వసనీయ సమాచారం వచ్చిందన్నారు. వెంటనే పోలీస్ సిబ్బందితో జైరాం తండాకు వెళ్లి పరిశీలించి, తండాలో ఉన్న అక్రమ ఇసుక ఫిల్టర్‌ను కూల్చి వేయించామన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మిస్బావుద్దీన్, సిబ్బంది, వీఆర్ఏ మంజుల పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలి



అల్లాదుర్గం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

అల్లాదుర్గం(మెదక్): ప్రతీ కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని మండల కేంద్రం అల్లాదుర్గంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముప్పారం గ్రామ దళితులు ముట్టడించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 50, 60 కుటుంబాలు ఉంటే ఇందులో పేదలను వదిలిపెట్టి, భూములు, డబ్బున్న వారిలో ఐదుగురికే ఇవ్వడం పై దళిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ కుటుంబానికి దళితబంధు ఇవ్వాలని ముప్పారం గ్రామానికి చెందిన 30 కుటుంబాలకు చెందిన వారు ఎంపీడీఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ముప్పారం గ్రామంలో 50 వరకు దళిత కుటుంబాలు ఉంటే కేవలం ఐదుగురికి మాత్రమే ఇచ్చారని వాపోయారు. బీఆర్ఎస్ పార్టీ నేతలే దళితబంధు పొందుతున్నారని వారు ఆరోపించారు.

పిల్లలకు ముర్రుపాలు ఎంతో శ్రేష్ఠం



నర్సాపూర్: అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్

నర్సాపూర్: పిల్లలకు ముర్రు పాలు పట్టించాలని, అవి ఎంతో శ్రేష్ఠమైనవని రెడ్డిపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత చెప్పారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. దీంతో పాటు చిన్న పిల్లల తల్లులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ, ఏఎన్ఎం రోజారాణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోష ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ ర్యాలీలు నిర్వహించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ రాయిలాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని చల్మేడ గ్రామంలో మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులకు తల్లిపాలపైన అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకట నరసింహ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు భార్గవి, పద్మ, లక్ష్మీనర్సమ్మ, సునీత, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

హవేళీఘనపూర్: మండలంలోని మక్తభూపతిపూర్ గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించిన వారిలో సర్పంచ్ నీరజగౌడ్, పాలకవర్గం, అంగన్‌వాడీ టీచర్ ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధిలోని శేరీల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించిన వారిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం స్రవంతి, ఆశవర్కర్‌లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

మహిళపై విరిగిపడ్డ చెట్టుకొమ్మ

రామాయంపేట(మెదక్): బైక్‌పై వెళ్తున్న మహిళపై చెట్టుకొమ్మ విరిగిపడడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన మండలంలోని లక్ష్మాపూర్ గ్రామశివారులో బుధవారం చోటు చేసుకుంది. మెదక్ – ఎల్కతుర్తి రోడ్డు విస్తరణలో భాగంగా సంబంధిత కంట్రాక్టర్ రోడ్డు పక్కన చెట్టు నరికివేయిస్తున్నాడు. అదే సమయంలో మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మోగావత్ బాలమణి (బుజ్జి) తన అల్లుడితో కలిసిలో లక్ష్మాపూర్ బ్యాంక్‌కు బైక్‌పై వస్తుండగా, అకస్మాత్తుగా ఆమెపై కొమ్మ పడింది. ఈ సంఘటనలో కిందపడ్డ బాలమణి గాయపడగా, ఆమెను చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని రామాయంపేట పోలీసులు పేర్కొన్నారు.

మైనార్టీలకు ఉచిత శిక్షణ

మెదక్ కలెక్టరేట్: గ్రూప్ – 3 ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న మైనార్టీలకు 90 రోజుల పాటు 100 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లా నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణకు జిల్లాలోని మైనార్టీలు ఈనెల 6 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 81427 41976 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బాసర ఆలయంలో సునీతారెడ్డి పూజలు



నర్సాపూర్: బాసర సరస్వతీ మాతను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బుధవారం దర్శించుకొని పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి బాసరకు వెళ్లిన ఆమె.. సరస్వతీ మాత సన్నిధిలో మనుమరాలు నివిత్రిరెడ్డికి వేద పండితుల సమక్షంలో అక్షరభ్యాసం చేయించారు.

పూజలో పాల్గొన్న సునీతారెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ **ఎమ్మెల్యేను కలిసిన ఏడీఏ**

నర్సాపూర్: నర్సాపూర్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు సంధ్యారాణి బుధవారం ఉదయం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారని ఆమె చెప్పారు. తాను ఇటీవల నర్సాపూర్ ఏడీఏగా బాధ్యతలు తీసుకున్నందున మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను కలిసినట్లు చెప్పారు.

◆ **విద్యార్థులకు పోషకాహార ప్యాకెట్లు అందజేత**

రామాయంపేట(మెదక్): విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా ఆవాస విద్యాలయంలోని విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ సభ్యులు పోషకాహార ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు దేమె యాదగిరి, క్లబ్ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి వంగరి కైలాసం, ఆవాసం ఇన్‌చార్జ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **నేటి నుంచి నులిపురుగుల నివారణ మందు పంపిణీ**

నర్సాపూర్: ఈనెల 3 నుంచి నులి పురుగుల నివారణ మందు పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయనిర్మల చెప్పారు. తమ డివిజన్ పరిధిలో అన్ని గ్రామాల్లో, పాఠశాలల్లో మందును పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు. నిబంధనల మేరకు మందు బిళ్లలను పంపిణీ చేయాలని ఆమె వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు.

◆ **టార్పాలిన్ల అందజేత**

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామంలో పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు మైనంపల్లి సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు బుధవారం టార్పాలిన్లు అందజేశారు. సంఘం మండల సభ్యులు కమ్మరి రమేశ్ చారి, మైలారం బాబు, కట్టబాబు, వినద్, నరేశ్, కళ్యాణ్, భాను, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

◆ **జీపీ కార్మికుల సమ్మె**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో జీపీ కార్మికులు సమ్మె కొనసాగుతుంది. బుధవారం వివిధ గ్రామాలకు చెందిన జీపీ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

◆ **ఓపెన్ స్కూల్‌లో చేరేందుకు 10 వరకు గడువు**

నర్సాపూర్: ఓపెన్ స్కూల్‌లో చేరేందుకు ఈనెల 10వరకు గడువు ఉందని జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి చెప్పారు. ఆయన బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ సెంటర్‌లో ఉపాధ్యాయులతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ విఠల్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **ఈవీఎంలపై అవగాహన**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాలల్లో రెవెన్యూ అధికారులు ఈవీఎం మిషన్లపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బుధవారం ఆర్ఐ శ్రీహరి ఆధ్వర్యంలో కూకుట్లపల్లి, భుజిరంపేట, పీర్యతండా, మనంతయపల్లి తండాల్లో ఈవీఎం ప్రచార రథం ద్వారా గ్రామస్తులకు ఈవీఎంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జీవులనాయక్ బీఎల్ఓలు పాల్గొన్నారు.

◆ **ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు**

రేగోడ్(మెదక్): స్థానిక మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల కోసం ఈనెల 5 వరకు గడువు పెంచామని కళాశాల ప్రిన్సిపాల్ జయ ప్రకాశ్ బుధవారం తెలిపారు. ఈనెల 6 నుంచి ఆగస్టు 18 వరకు రూ.500లు అపరాధ ఫీజుతో అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. పదో తరగతి పాసై, ఇంకా ఏ కళాశాలలో చేరని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ **మండల ముదిరాజ్ యూత్ అధ్యక్షుడిగా రవి**

చేగుంట(తూప్రాన్): ముదిరాజ్ మండల యూత్ అధ్యక్షుడిగా పులబోయిన రవికి ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ హైదరాబాద్‌లో నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో జగన్, శ్రీనివాస్, వనలక్ష్మి, రాజు, సిద్ధిరాములు, సత్యనారాయణ, భిక్షపతి, నర్సింలు, రవి, నరేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన**

రామాయంపేట(మెదక్): మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో బుధవారం పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ దయాలక్ష్మి భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు.

◆ **సీఈఐఆర్ ద్వారా మొబైల్‌ఫోన్ రికవరీ**

కౌడిపల్లి(నర్సాపూర్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా రికవరీ చేసి బాధితునికి అందజేశారని కౌడిపల్లి ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని అంతారం తండాకు చెందిన బడావత్ నవన్‌కుమార్ రెండు నెలల క్రితం కౌడిపల్లి అంగడిలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. బాధితుడు మీసేవ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి పోగొట్టుకున్న ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అందజేశారని చెప్పారు.

◆ **ఉపాధ్యాయులకు శిక్షణ**

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయులు తమ నైపుణ్యతను పెంచుకునేందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఉపయోగపడుతుందని మండల నోడల్ విద్యాధికారి విశ్వనాథం అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ నిర్వహించారు.

పాపన్నపేట(మెదక్): తొలిమెట్టు శిక్షణ భవితకు పట్టులాంటిదని కోర్సు డైరెక్టర్ నోడల్ అధికారి అంజాగౌడ్ అన్నారు. మండలంలోని ఉపాధ్యాయులకు కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్, గణితం బోధించే అంశాలపై శిక్షణ నిర్వహించారు.

◆ **విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి**

టేక్మాల్(మెదక్): విద్యార్థులకు తమ సామర్థ్యాలకు అనుగుణంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎఫ్ఎల్ఎన్ స్టేట్ రిసోర్స్ పర్సన్ ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన టేక్మాల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ టీచర్స్) మౌళిక బాషా గణిత సామర్థ్యాల సాధన మండల లేవల్ ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో మండల నోడల్ అధికారి శివకుమార్, మండల ఆర్‌పీలు శ్రీనివాస్, సత్యం, కృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **129 రోజులకు చేరిన దీక్షలు**

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు బుధవారం నాటికి 129 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు మాట్లాడుతూ.. రామాయంపేటకు డివిజన్ మంజూరైతేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

◆ **చెరువు కట్టలపై ఈత మొక్కలు నాటాలి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): హరితహారంలో భాగంగా ప్రతీ గ్రామంలోని చెరువు కట్టలపై ఈత మొక్కలు నాటాలని ఎక్సైజ్ ఎస్ఐ లు ఎండీ, అజీజ్ అహ్మద్, రాఘవేందర్ రావు అన్నారు. బుధవారం వారు సిబ్బందితో కలిసి మండల కేంద్రం చిలప్‌చెడ్‌తో పాటు, గౌతాపూర్ గ్రామంలో చెరువుకట్టలపై ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యాంకుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ **ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం**

చేగుంట(తూప్రాన్): హర్యానా రాష్ట్రం వాయినాడ్‌లో రాళ్లదాడిని నిరసిస్తూ చేగుంట గాంధీ చౌరస్తా వద్ద బీజేపీ, బీహెచ్‌పీ, బజరంగ్‌దల్ కార్యకర్తలు రస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి శ్యామ్ ఆధ్వర్యంలో ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేశారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షులు సోమసురేశ్, భూపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఉన్నారు.

◆ **నిధులు మంజూరు చేయండి**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న కబ్రస్థాన్‌కు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని గ్రామ మైనార్టీలు కోరారు. ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మండల కోఆప్షన్ సభ్యుడు హైమద్, గ్రామ మైనార్టీలు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిశారు.

◆ **యాజమాన్య పద్ధతులు పాటించాలి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్, చండూర్, ఫైజాబాద్ గ్రామాల రైతులకు వరిలో సమగ్ర పోషక యాజమాన్యం గురించి వివరించారు. ఏఈఓలు భూపాల్, రమ్య, రైతులు విష్ణువర్ధన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **నష్టపోయిన బాధితులకు భరోసా ఏది ?**

చిన్నశంకరంపేట(మెదక్): భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన, ఇళ్లు శిథిలమైన వారికి ప్రభుత్వం భరోసా కల్పించడంలో విఫలమైందని టీపీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే బాధితులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్ ఉన్నారు.

◆ **నియామకం**

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండల ముదిరాజ్ యువత అధ్యక్షుడిగా కుమారస్వామి ఎన్నికయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు మానెగల్ల రామకిష్టయ్య ఉత్తర్వులు జారీచేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి అక్షయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, మండలాధ్యక్షుడు సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు, జిల్లా మత్స్య కార్మిక సంఘం డైరెక్టర్ దేవెందర్, తదితరులు పాల్గొన్నారు.

◆ **అంత్యక్రియలకు వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో గాయాలు**

అల్లాదుర్గం(మెదక్): బంధువుల అంత్యక్రియలకు బైక్‌పై వెళ్తున్న తండ్రికొడుకు ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం రాత్రి అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో చోటు చేసుకుంది. అల్లాదుర్గం మండలం ముప్పారం గ్రామానికి చెందిన చాకలి నారాయణ, ఆయన కొడుకు రాజు అల్లాదుర్గంలో మృతి చెందిన బంధువుల అంత్యక్రియలకు బైక్‌పై వెళ్తున్నారు. చిల్వెర ఐబీ చౌరస్తా వద్దకు చేరుకోగానే వట్‌పల్లి వైపు నుంచి వస్తున్న కారు మూలమలుపు వద్ద బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో రాజుకు తీవ్రగాయాలు కాగా, నారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

◆ **ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమేశ్**

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా రమేశ్ గంగాల బాధ్యతలు స్వీకరించారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ చేతుల మీదుగా ఉత్తర్వులను అందుకున్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు మాధవారెడ్డి, చంద్రమోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **క్రీడా బాలికల పాఠశాలలో అడ్మిషన్‌లు**

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని చేగుంటలో నడుస్తున్న రాష్ట్రస్థాయి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల క్రీడా పాఠశాలలో వివిధ తరగతుల్లో గల అడ్మిషన్ల కోసం ఈ నెల 8న బ్యాటరీ టెస్ట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఆ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ టి.సంపత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **తండాలను పంచాయతీలుగా చేయాలి**

టేక్మాల్(మెదక్): మండలంలోని పలు గ్రామ పంచాయతీల నుంచి తండాలను పంచాయతీలుగా చేయాలని బుధవారం బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందించారు. టేక్మాల్ మండలంలోని హసన్ మహమ్మద్ పల్లి పంచాయతీ నుంచి లాలూతండా, షాబాద్ తాండా పంచాయతీ నుంచి నల్లకుంట తాండ, ఎల్లంపల్లి పంచాయతీ నుంచి పోగులంపల్లి గ్రామలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందులో బీఆర్ఎస్ మండల నాయకులు చింత రవి, సత్యనారాయణ, సర్దార్, కిషన్, చందునాయక్ పాల్గొన్నారు.